


నేటిపత్రిక PRGI Regd. No: APTEL/26/A0819

# ప్రజాసీమ

జాతీయ తెలుగు దినపత్రిక

NETIPATRIKA PRAJASEEMA-TELUGU DAILY

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 11 | బుధవారం 11, ఫిబ్రవరి 2026 | పేజీలు : 08 | వెల: 02


## కేంద్ర ఆర్థిక మంత్రితో చంద్రబాబు భేటీ

-ఏపీ అభివృద్ధి అంశాలపై చర్చ

-కేంద్ర--రాష్ట్ర సమన్వయానికి ప్రాధాన్యం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (నేటిపత్రిక ప్రజాసీమ ప్రతినిధి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్ హౌస్‌లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలు, అభివృద్ధి అవసరాలు, కేంద్ర సహకారం వంటి విషయాలపై విస్తృతంగా చర్చ జరిగినట్లు సమాచారం. ఈ సమావేశంలో కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్ మోహన్ నాయుడు కింజరపు, కేంద్ర భారీ పరిశ్రమలు ఒ స్టీల్ శాఖ సహాయ మంత్రి భూపతి రాజు వర్మ, గ్రామీణాభివృద్ధి ఒ కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కూడా హాజరయ్యారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసన వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. లోక్‌సభ సభ్యులు శ్రీకృష్ణ దేవరాయలు లావు, శ్రీభరత్ మాతుకుమిల్లి, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, టంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, వల్లభనేని బాలశౌర్య సమావేశంలో ఉన్నారు. రాష్ట్ర అభివృద్ధి ప్రాజెక్టులు, మౌలిక వసతులు, పెట్టుబడుల ఆకర్షణ, కేంద్ర పథకాల అమలు వంటి అంశాల్లో కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని ఈ సమావేశంలో నేతలు అభిప్రాయపడ్డట్లు తెలుస్తోంది.

## తప్పుడు జీఎస్‌డీపీ గణాంకాలతో ప్రజలను మోసం చేస్తున్నారు: జగన్



అమరావతి, ఫిబ్రవరి 10 (నేటిపత్రిక ప్రజాసీమ ప్రతినిధి): వైసీపీ అధినేత వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నప్పటికీ, ప్రభుత్వం తప్పుడు జీఎస్‌డీపీ (స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి) గణాంకాలతో ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోందనే భ్రమ కల్పించేందుకే అబద్ధపు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వం విడుదల చేసిన వివరాల ప్రకారం 2024--25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ 11.75 శాతం వృద్ధి సాధించిందని, 2025--26లో ఇది 10.75 శాతంగా ఉంటుందని అంచనా వేస్తున్నట్లు చెప్పడాన్ని జగన్ తప్పుబట్టారు. ఈ వృద్ధి రేటుతో దేశంలోనే మూడో స్థానంలో ఉన్నామని ప్రభుత్వం చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. ఇవి ఏ స్వతంత్ర సంస్థ ఇచ్చిన లెక్కలు కావని, కేవలం నారా చంద్రబాబు నాయుడు కార్యాలయంలో సృష్టించిన గణాంకాలేనని విమర్శించారు. ప్రభుత్వం చెబుతున్న వృద్ధి నిజమైతే పన్నుల రాబడిలోనూ అదే స్థాయి పెరుగుదల కనిపించాల్సి ఉంటుందని జగన్ అన్నారు. కానీ కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఈ ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలలకు విడుదల చేసిన లెక్కలు ప్రభుత్వ బూటకపు ప్రచారాన్ని బట్టబయలు చేశాయని తెలిపారు. గత రెండేళ్లలో రాష్ట్ర పన్నుల రాబడి వృద్ధి సగటున కేవలం 1.97 శాతంగా మాత్రమే ఉందని, ఇది దిగ్భ్రాంతికరమన్నారు. “11 శాతం పైగా జీఎస్‌డీపీ వృద్ధి సాధిస్తున్న రాష్ట్రంలో పన్నుల రాబడి 2 శాతం లోపు ఎలా ఉంటుంది?” అని ప్రశ్నిస్తూ ఎద్దేవా చేశారు. ఇదే సమయంలో దేశంలోని 23 రాష్ట్రాల పన్నుల రాబడి వృద్ధిపై కాగ్ విడుదల చేసిన గణాంకాలను ప్రస్తావించిన జగన్, ఆ జాబితాలో ఆంధ్రప్రదేశ్ అట్టడుగు నుంచి రెండో స్థానంలో---అంటే 22వ ర్యాంక్‌లో నిలవడం సిగ్గుచేటన్నారు. ఇదే చంద్రబాబు ‘22వ ర్యాంక్ విజన్’ అంటూ సెటైర్లు వేశారు. చంద్రబాబు నాయకత్వంలో ఏపీ మొదటి స్థానంలో ఉందంటే అది అప్పులు, అవినీతి, రాజకీయ కక్ష సాధింపులు, తప్పుడు ప్రచారంలో మాత్రమేనని జగన్ తీవ్రంగా విమర్శించారు.

## నరవణే పుస్తకంపై వివాదం

-లోక్‌సభలో ప్రస్తావనతో రాజుకున్న రాజకీయ వేడి

-పెంగ్విన్ ప్రకటన--రాహుల్ ప్రశ్నలు




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (నేటిపత్రిక ప్రజాసీమ): మాజీ ఆర్మీ చీఫ్ ఎం.ఎం. నరవణే రచించిన ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ పుస్తకం రాజకీయంగా వివాదాస్పదంగా మారింది. ఈ పుస్తకంలోని కొన్ని అంశాలను ఇటీవల రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రస్తావించడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. దాంతో వారం రోజులుగా లోక్‌సభ కార్యకలాపాలు సజావుగా సాగడం లేదు. పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడిన రాహుల్ గాంధీ, ఈ అంశంపై నరవణే చేసిన ఓ ట్వీట్‌ను చదివి వినిపించారు. తాను రాసిన పుస్తకం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉందని, లింక్ ఓపెన్ చేస్తే విషయాలు తెలుస్తాయని నరవణే ట్వీట్‌లో పేర్కొన్నట్లు రాహుల్ వెల్లడించారు. ఈ పుస్తకాన్ని పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా ప్రచురించినట్లు సమాచారం ఉన్నప్పటికీ, సంస్థ మాత్రం ఇప్పటివరకు పుస్తకాన్ని విడుదల చేయలేదని తాజాగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ కీలక ప్రశ్నలు లేవనెత్తారు. నరవణే అబద్ధం చెబుతున్నారా? లేక పెంగ్విన్ సంస్థ అబద్ధం చెబుతోందా? అని ప్రశ్నించారు. ప్రింట్ లేదా డిజిటల్ ఫార్మాట్‌లో పుస్తకాన్ని విడుదల చేయలేదని పెంగ్విన్ స్పష్టం చేస్తుండగా, అమెజాన్‌లో పుస్తకం అందుబాటులో ఉందని తాను చెబుతున్నట్లు రాహుల్ పేర్కొన్నారు. అయితే పెంగ్విన్ కంటే నరవణే వ్యాఖ్యలనే నమ్ముతున్నానని, నరవణే అబద్ధం చెప్పరని భావిస్తున్నానని రాహుల్ తెలిపారు. ఈ విభేదాల మధ్య నిజం ఏంటన్నది ఇప్పటికీ నిర్ధారణ కాలేదని ఆయన వ్యాఖ్యానించారు.

## లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై కాంగ్రెస్ అవిశ్వాస నోటీసు

-స్పీకర్ పదవి నుంచి తొలగింపునకు ప్రతిపక్షాల ప్రయత్నం

-120 మంది ఎంపీల సంతకాలు

-రాజ్యాంగ ఆర్టికల్ 94-సీ ప్రకారం నోటీసు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (నేటిపత్రిక ప్రజాసీమ ప్రతినిధి): లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పై ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ అవిశ్వాస తీర్మాన నోటీసు ఇచ్చింది. స్పీకర్ పదవి నుంచి ఓం బిర్లాను తొలగించేలా తీర్మానం ప్రవేశపెట్టేందుకు లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు ఈ నోటీసు సమర్పించినట్లు కాంగ్రెస్ వెల్లడించింది. రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా విపక్ష నేత రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వలేదని కాంగ్రెస్ ఆరోపించింది. అంతేకాదు, ఎనిమిది మంది విపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడం, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే చేసిన నిరాధార ఆరోపణలపై చర్యలు తీసుకోకపోవడం వంటి అంశాలను అవిశ్వాసానికి కారణాలుగా ప్రతిపక్షాలు పేర్కొన్నాయి. అవిశ్వాస నోటీసు అనంతరం కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ, రాజ్యాంగంలోని ఆర్టికల్ 94-సీ ప్రకారం ఈ నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే సహా పలు పార్టీలకు చెందిన మొత్తం 120 మంది ఎంపీలు ఈ అవిశ్వాస నోటీసుకు సంతకాలు చేశారని వెల్లడించారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలను విపక్షాలు లేవనెత్తకుండా స్పీకర్ పదేపదే అడ్డుకోవడం తమను తీవ్రంగా బాధించిందని గౌరవ్ గొగోయ్ అన్నారు. పలు సందర్భాల్లో విపక్ష నేతలకు మాట్లాడే హక్కును నిరాకరించారని, అది ఎంపీల ప్రాథమిక హక్కు అని గుర్తుచేశారు. రాజ్యాంగపరమైన హక్కులను వినియోగించుకున్నందుకే ఎనిమిది మంది విపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

## తిరుమల శ్రీవారి సన్నిధికి చేరిన బండ్ల గణేష్ సంకల్ప యాత్ర



తిరుమల, ఫిబ్రవరి 10 (నేటిపత్రిక ప్రజాసీమ ప్రతినిధి): ప్రముఖ నిర్మాత, నటుడు బండ్ల గణేష్ చేపట్టిన సంకల్ప యాత్ర విజయవంతంగా పూర్తైంది. 23 రోజుల పాటు సుమారు 535 కిలోమీటర్ల మేర సాగిన ఈ పాదయాత్ర నేడు తిరుమల శ్రీవారి సన్నిధికి చేరడంతో ముగిసింది. శ్రీవారి దర్శనంతో పాటు యాత్ర పూర్తి కావడం పట్ల భక్తుల్లో ప్రత్యేక స్పందన కనిపించింది. తిరుమల చేరుకున్న అనంతరం బండ్ల గణేష్, తిరుమలలోని క్యాంప్ కార్యాలయంలో బీఆర్ నాయుడు ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యాత్ర వివరాలు, తన సంకల్ప భావనను ఆయన చైర్మన్‌కు వివరించినట్లు సమాచారం. ఈ భేటీలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు బండ్ల గణేష్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. భక్తి, సంకల్పంతో సాగిన ఈ పాదయాత్ర ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఆయన ప్రశంసించారు. శ్రీవారి కృపతో యాత్ర సాఫీగా పూర్తవడం ఆనందకరమని తెలిపారు. తిరుమల శ్రీవారి దర్శనంతో యాత్ర ముగియడంతో బండ్ల గణేష్ భక్తి భావం, సంకల్ప శక్తిపై పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ పాదయాత్ర ఆధ్యాత్మికతతో పాటు ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలపరిచిందని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

## కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సీఎం చంద్రబాబు భేటీ



-రాష్ట్ర ప్రాజెక్టులు, కేంద్ర నిధులపై చర్చ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (నేటిపత్రిక ప్రజాసీమ ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర హోంమంత్రి అమిత్ షా తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. అనంతరం సీఎం చంద్రబాబు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తో కూడా సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్ర అభివృద్ధి ప్రాజెక్టులు, కేంద్రం నుంచి అందాల్సిన నిధులు, ఆర్థిక సహకారం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. కేంద్ర మంత్రులతో జరిగిన ఈ సమావేశాలు రాష్ట్రానికి కీలకమైన ప్రాజెక్టుల పురోగతికి, కేంద్ర--రాష్ట్ర సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడానికి దోహదపడతాయని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

# సంపాదకీయం

## ఆరోగ్య సమస్యగా మారుతున్న నిద్రలేమి

ఆధునిక జీవితం మనిషి జీవన విధానాన్ని పూర్తిగా మార్చేసింది. ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకూ ఒక నిరంతర పరుగుల్లా జీవితం సాగుతోంది. పని ఒత్తిళ్లు, లక్ష్యాల వెనక పరుగు, ఆర్థిక బాధ్యతలు, భవిష్యత్తుపై ఆందోళనలు కలిసి మనిషి విశ్రాంతిని మెల్లగా దూరం చేస్తున్నాయి. ఒకప్పుడు శరీరం అలసినప్పుడు సహజంగా కళ్ళు మూసుకుపోయేవి. నేడు అలసట ఉన్నా నిద్ర రాకుండా మేల్కొని గడిపే రాత్రులు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితి నిద్రలేమిని వ్యక్తిగత అలవాటు సమస్యగా కాకుండా, సమాజమంతటినీ ప్రభావితం చేసే కొత్త ఆరోగ్య సమస్యగా మార్చుతోంది. నిద్రలేమి అనేది ఒక్క రాత్రి నిద్ర పట్టకపోవడం మాత్రమే కాదు. అది శరీరం, మనసు రెండింటిపైనా దీర్ఘకాలిక ప్రభావం చూపే సమస్య. సరైన నిద్ర లేకపోతే మనసు క్రమంగా అలసిపోతుంది. చిరాకు పెరుగుతుంది, చిన్న విషయాలకే కోపం వస్తుంది, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం తగ్గుతుంది. చదువులో, పనిలో ఏకాగ్రత లోపిస్తుంది. ఇవన్నీ మొదట చిన్న సమస్యలుగా కనిపించినా, కాలక్రమంలో మానసిక ఒత్తిడి, ఆందోళన వంటి పెద్ద సమస్యలకు దారి తీస్తున్నాయి. శరీర ఆరోగ్యంపై నిద్రలేమి ప్రభావం మరింత ప్రమాదకరం. సరైన విశ్రాంతి లేకపోవడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గిపోతుంది. రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు, మధుమేహం వంటి జీవనశైలి వ్యాధులకు నిద్రలేమి ఒక కారణంగా మారుతోందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. శరీరం రోజంతా చేసిన శ్రమ నుంచి కోలుకునే సమయం నిద్రలోనే లభిస్తుంది. ఆ అవకాశాన్ని కోల్పోతే, శరీరం లోపలినుంచి కుంగిపోతుంది. నేటి కాలంలో నిద్రలేమికి ప్రధాన కారణంగా మారింది స్క్రీన్‌లపై పెరుగుతున్న ఆధారపడటం. రాత్రి పడుకునే ముందు మొబైల్‌లో సందేశాలు చూడడం, వీడియోలు చూడడం, సామాజిక మాధ్యమాల్లో గడపడం సాధారణ అలవాటుగా మారిపోయింది. ఈ వెలుగు కళ్ళను మాత్రమే కాదు, మనసును కూడా చురుకుగా ఉంచుతుంది. ఫలితంగా సహజ నిద్ర చక్రం భంగం అవుతోంది. పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరూ ఈ సమస్యకు గురవుతున్నారు. వినోదం పేరుతో మొదలైన ఈ అలవాటు, మెల్లగా ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది. ఉద్యోగ ఒత్తిళ్లు కూడా నిద్రలేమిని పెంచుతున్న ప్రధాన కారణాల్లో ఒకటి. పని పూర్తయిన తర్వాత కూడా మనసు పనినే మోసుకుపోతుంది. రేపటి లక్ష్యాలు, పనితీరు భయం, ఉద్యోగ భద్రతపై ఆందోళనలు రాత్రంతా వెంటాడుతూనే ఉంటాయి. ఇంటికి వచ్చినా మనసుకు విశ్రాంతి లభించకపోవడంతో, నిద్ర దూరమవుతోంది. దీని ప్రభావం కుటుంబ జీవితంపైనా పడుతోంది. మాటలు తగ్గుతాయి, అనుబంధాలు బలహీనపడతాయి. పిల్లలు, యువతలో నిద్రలేమి మరింత ఆందోళన కలిగించే అంశంగా మారుతోంది. చదువు ఒత్తిడి, పరీక్షల భయం, భవిష్యత్తుపై అంచనాలు వారి నిద్రను దూరం చేస్తున్నాయి. సరైన నిద్ర లేకపోవడం వల్ల వారి శారీరక ఎదుగుదల, మానసిక స్థిరత్వం దెబ్బతింటోంది. చిన్న వయసులోనే అలసట, ఒత్తిడి అలవాటుగా మారడం భవిష్యత్తుకు ప్రమాదకరం. నిద్రలేమికి పరిష్కారం మందుల్లో మాత్రమే ఉందని భావించడం తప్పు. అసలు పరిష్కారం జీవనశైలిలో మార్పు. పని, విశ్రాంతి మధ్య సమతుల్యత అవసరం. రాత్రి పడుకునే ముందు స్క్రీన్‌లకు దూరంగా ఉండే అలవాటు పెంచుకోవాలి. కుటుంబంతో మాట్లాడటం, ప్రశాంతమైన అలవాట్లు అలవరచుకోవాలి. నిద్రను విలాసంగా కాకుండా, ఆరోగ్యానికి అవసరమైన అంశంగా చూడాల్సిన ఆలోచన సమాజంలో బలపడాలి. నిద్ర అనేది సమయ వృథా కాదు. అది శరీరానికి శక్తిని తిరిగి ఇచ్చే ప్రక్రియ. మనసుకు ప్రశాంతతను అందించే సహజ ఔషధం. ఆరోగ్యానికి పునాది. నిద్రను నిర్లక్ష్యం చేసే సమాజం అనారోగ్యాన్ని ఆహ్వానించినట్టే. అందుకే నిద్రలేమిని కొత్త ఆరోగ్య సమస్యగా గుర్తించి, దానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయం వచ్చింది. విశ్రాంతి పొందిన మనసే ఆరోగ్యకరమైన వ్యక్తికి, ఆరోగ్యకరమైన సమాజానికి నిజమైన బలం. ఉద్యోగ ఒత్తిళ్లు కూడా నిద్రలేమికి కారణమవుతున్నాయి. పని పూర్తయినా మనసు పనిలోనే ఉండిపోతోంది. రేపటి లక్ష్యాలు, బాధ్యతలు, భయాలు రాత్రంతా వెంటాడుతూనే ఉంటాయి. ఇంటికి వచ్చిన తర్వాత కూడా విశ్రాంతి లభించకపోవడంతో, నిద్ర దూరమవుతోంది. ఇది కుటుంబ జీవితం, వ్యక్తిగత ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. నిద్రలేమికి పరిష్కారం మందుల్లో మాత్రమే లేదన్న విషయాన్ని సమాజం గుర్తించాల్సిన అవసరం ఉంది. జీవనశైలిలో మార్పు రావాలి. పని--విశ్రాంతి మధ్య సమతుల్యత అవసరం. పడుకునే సమయానికి ముందు స్క్రీన్ వినియోగాన్ని తగ్గించాలి. కుటుంబంతో మాట్లాడటం, మనసును ప్రశాంతంగా ఉంచే అలవాట్లు పెంచుకోవాలి. నిద్రను విలాసంగా కాకుండా, ఆరోగ్యానికి అవసరమైన అంశంగా చూడాలి. నిద్ర అనేది సమయ వృథా కాదు. అది శరీరానికి పునరుత్తేజం. మనసుకు ప్రశాంతత. ఆరోగ్యానికి పునాది. నిద్రను నిర్లక్ష్యం చేసే సమాజం అనారోగ్యాన్ని ఆహ్వానించినట్లే. అందుకే నిద్రలేమిని కొత్త ఆరోగ్య సమస్యగా గుర్తించి, దానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయం వచ్చింది. విశ్రాంతి పొందిన మనసే ఆరోగ్యకరమైన సమాజానికి బలమైన ఆధారం.

# సమ్మెను జయప్రదం చేయండి

**–ఉమ్మడి కార్మిక సంఘాలు**




శ్రీకాళహస్తి నేటిపత్రిక ప్రజాసీమ: మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను వ్యతిరేకిస్తూ ఈ నెల 12వ తేదీన దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఉమ్మడి కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. పట్టణ ప్రజలు, దుకాణదారులు స్వచ్ఛందంగా సమ్మెకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సిఐటియు, ఏఐటియూసీ, ఐఎఫ్టియు ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మెకు మద్దతుగా మంగళవారం శ్రీకాళహస్తి పట్టణంలో బైకు ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్ నుంచి నాలుగు మాఢ వీధుల గుండా బైక్ ర్యాలీ సాగింది. నల్ల కార్మిక చట్టాల వల్ల కలిగే అనర్థాలను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య ప్రజలకు వివరించారు. కార్పొరేట్ లకు మేలు చేకూర్చే నాలుగు లేబర్ కోడ్ల వల్ల కార్మికలోకం కునారిల్లే ప్రమాదం ఉందనీ, తద్వారా జనజీవనం అస్తవ్యస్థంగా మారుతుందని తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, గంధం మణి, వేణు, రేవతి, ఏఐటీయూసీ నాయకులు కత్తి రవి, ఐఎఫ్టీయూ నాయకులు జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 13 నుండి 15వ తేది వరకు తరిగొండ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభ సంప్రోక్షణ మహోత్సవాలు



మదనపల్లి/గుర్రంకొండ నేటిపత్రిక ప్రజాసీమ: అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలం, తరిగొండలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో నూతన ధ్వజస్తంభ సంప్రోక్షణ మహోత్సవాలు ఫిబ్రవరి 13 నుండి 15వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మూడు రోజులపాటు వేద మంత్రోచ్చారణల నడుమ వైదిక కార్యక్రమాలు జరుగనున్నాయి. ఫిబ్రవరి 12న జ్యేష్ఠ నక్షత్రంలో సాయంత్రం అంకురార్పణతో నూతన ధ్వజ స్తంభ సంప్రోక్షణ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా అఖండ దీపారాధన, భగవత్ ప్రార్థన , అంకురార్పణ, ధాన్యాధివాసం కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఫిబ్రవరి 13వ తేదీన చతుస్థానార్చన, హోమం, జలాధివాసం, క్షీరాధివాసం తదితర వైదిక కార్యక్రమాలను చేపడుతారు. ఫిబ్రవరి 14వ తేదీన చతుస్థానార్చన, ఛాయాధివాసం, పంచశయాధివాసం, లఘు పూర్ణాహుతి జరుగనుంది. ఫిబ్రవరి 15వ తేదీన త్రయోదశి, ఉత్తరాషాడ నక్షత్రయుక్త కుంభ లగ్నపుష్కరాంశయందు ఉదయం 08.16 గం.లకు ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవం చేపడుతారు. అనంతరం కుంభ ఉద్వాసనం, బింబ ఉద్వాసనం, మహా సంప్రోక్షణ, కుంభలగ్నం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారు. మహా నివేదన, బలిహారణ, మంగళ శాసన, శాత్తుమొర తీర్థ ప్రసాద గోష్ఠి విద్వత్ సంభావనం చేపడుతారు. ఈ మహోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలు పొందాలని టిటిడి కోరుతోంది.



# బడ్జెట్ సమావేశాలను ప్రారంభించిన మేయర్ డాక్టర్ శిరీష



తిరుపతి, ఫిబ్రవరి 10(నేటిపత్రిక ప్రజాసీమ): తిరుపతి నగరపాలక సంస్థ చివరి ఐదవ బడ్జెట్ సమావేశాలు నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన ఎస్వీయూ సెనేట్ హాల్‌లో ప్రారంభమయ్యాయి. బడ్జెట్ సమావేశాన్ని మేయర్ డాక్టర్ శిరీష లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వరుసగా ఐదవ బడ్జెట్‌ను ప్రవేశపెట్టే కౌన్సిల్‌కు మేయర్‌గా అవకాశం లభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కౌన్సిల్ సభ్యుల సహకారంతోనే ఈ గౌరవం దక్కిందని తెలిపారు. చివరి బడ్జెట్‌ను గ్రేటర్ తిరుపతి నగర బడ్జెట్‌గా ప్రవేశపెట్టే అవకాశం వస్తుందని ఆశించినా, గ్రేటర్ ప్రక్రియ ఆలస్యం కావడం పట్ల కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు. అయినప్పటికీ రానున్న ఎన్నికలు మాత్రం గ్రేటర్ తిరుపతి నగరపాలక సంస్థకే జరుగుతాయన్న నమ్మకం ఉందన్నారు. గతంలో కౌన్సిల్ ఆమోదించిన గ్రేటర్ తిరుపతికి ప్రభుత్వ ఆమోదం ఇవ్వాలని మరోసారి విజ్ఞప్తి చేశారు. బడ్జెట్ అనేది ఒక నిర్దిష్ట కాలానికి ఆదాయ--వ్యయాల అంచనాలతో రూపొందించే ఆర్థిక ప్రణాళిక అని తెలిపారు. ఆదాయ, వ్యయాల మధ్య సమతుల్యత ఉండేలా బడ్జెట్ రూపొందిస్తేనే ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. ఆమోదించబోయే బడ్జెట్ తిరుపతి నగర భవిష్యత్తుకు ఉపయోగపడే విధంగా ఉండాలని, ప్రజలు చెల్లిస్తున్న ప్రతి రూపాయిని బాధ్యతగా ఖర్చు చేస్తున్నామన్న నమ్మకం కలిగేలా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. బడ్జెట్ చర్చలో పాల్గొనే ప్రతి సభ్యుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. నగర ప్రజల రోజువారీ అవసరాలు తీరేలా, అలాగే వేగంగా అభివృద్ధి చెందుతున్న తిరుపతి భవిష్యత్ మౌలిక వసతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ద్విముఖ వ్యూహంతో బడ్జెట్ రూపొందించాలని సూచించారు. గత బడ్జెట్ ప్రతిపాదనలు, ఖర్చులపై హేతుబద్ధమైన చర్చ జరగాలని తెలిపారు. ఆదాయం కీలక అంశమని, ఆదాయ, వ్యయాలపై ప్రతి సభ్యుడు స్పష్టంగా మాట్లాడాలన్నారు. శ్రీవారి పాదాల చెంత ఉన్న నగరంగా తిరుపతికి ప్రత్యేక అవకాశాలున్నాయని, టీటీడీతో పాటు కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల నుంచి ఎక్కువ నిధులు రాబట్టుకోవాలని సూచించారు. ప్రజలపై అదనపు భారం పడకుండా వనరుల సమీకరణపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో నగర కమిషనర్ మౌర్య, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్యే శ్రీనివాసులు, కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విశాఖ ఉక్కు కర్మాగారం లాభాల బాటలోకి వచ్చింది

**– కేంద్ర ఉక్కు మంత్రితో సీఎం చంద్రబాబు భేటీ**

**– కేంద్ర--రాష్ట్ర సహకారంతో కర్మాగార పునరుజ్జీవనం**

**– కార్మికుల పట్టుదలతో ఉత్పాదకత పెరుగుదల**

ఢిల్లీ, ఫిబ్రవరి 10 (నేటిపత్రిక ప్రజాసీమ ): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీలో కేంద్ర ఉక్కు శాఖా మంత్రి హెచ్ డీ కుమారస్వామిను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విశాఖ ఉక్కు కర్మాగారం ప్రస్తుత స్థితిగతులు, భవిష్యత్ దిశపై సమగ్రంగా చర్చించారు. కేంద్ర ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయం, రాష్ట్ర ప్రభుత్వ మద్దతు, అలాగే కార్మికులు--ఉద్యోగుల అంకితభావం ఫలితంగా విశాఖ ఉక్కు కర్మాగారం లాభాల బాట పట్టిందని ముఖ్యమంత్రి వివరించారు. కష్టకాలాన్ని అధిగమించి ఉత్పాదకత పెరగడంతో పాటు ఆర్థిక స్థిరత్వం సాధించిందని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు అన్ని విధాలా సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. కర్మాగార అభివృద్ధి, కార్మికుల సంక్షేమం, భవిష్యత్ పెట్టుబడుల విషయంలో కేంద్రం--రాష్ట్రం సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఈ భేటీలో స్పష్టం చేశారు.

# విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి




గాలివీడు ఫిబ్రవరి 10(నేటిపత్రిక ప్రజాసీమ): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మండల విద్యా శాఖ అధికారి 2 శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో నీ శ్రీ రవిచంద్ర సీబీఎస్సీ స్కూల్ నందు మత్తురహిత సమాజము నైతిక విలువల తో కూడిన జీవనం అనే అంశంలో భాగంగా సేవ భావం స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత జీవన విధానం అనుసరించి ఒత్తిళ్ళను అధిగమించడానికి యువత మత్తు మత్తుపదార్థాలను వినియోగించడం జరుగుతున్నదని దానివలన చిన్న వయసులోనే ప్రాణాంతకమైన వ్యాధులతో బాధపడడం దీర్ఘకాలికమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవడం జరుగుతుంది కావున సమస్యలను తల్లిదండ్రుల దృష్టికి గాని ఉపాధ్యాయులు దృష్టికి గాని తీసుకొచ్చి నైతిక విలువలతో కూడిన జీవనాన్ని గడపవలెనని ఆయన విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ లిజా జాయ్, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

# వెనుకబడిన విద్యార్థుల కోసం రెసిడెన్షియల్ ప్రోగ్రాం.

**– అన్నమయ్య జిల్లా డిఈఓ సుబ్రహ్మణ్యం వెల్లడి**



మదనపల్లి ఫిబ్రవరి 10 నేటిపత్రిక ప్రజాసీమ: విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఆదేశాల మేరకు పదవ తరగతి చదువుతున్న జ, ఐ గ్రేడ్ కు చెందిన విద్యార్థులకు 30 రోజుల రెసిడెన్షియల్ ప్రోగ్రాం ఏర్పాటు చేశామని అన్నమయ్య జిల్లా డిఈఓ సుబ్రహ్మణ్యం తెలియజేశారు. మదనపల్లె మోతీనగర్ ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో జిల్లాలోని 182 మంది విద్యార్థుల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా విద్యార్థులకు సబ్జెక్టుల వారిగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.





శ్రీకాళహస్తి: శ్రీ భ్రమరాంబికా దేవి సమేత శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం వారి ఆధ్వర్యంలో శ్రీ జ్ఞాన ప్రసూనాంబికా దేవి సమేత శ్రీ కాళహస్తీశ్వర స్వామి వారి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం సందర్భంగా శ్రీశైలం దేవస్థానం కార్య నిర్వాహణ అధికారి పట్టు వస్త్రాలు సమర్పించారు.

నేటిపత్రిక PRGI Regd. No: APTEL/26/A0819
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక
NETIPATRIKA PRAJASEEMA-TELUGU DAILY



# వ్యవసాయశాఖ మంత్రి అచ్చంనాయుడు దృష్టికి మదనపల్లె టమోటా మార్కెట్ సమస్యలు

**-సీజన్ ప్రారంభానికి ముందే పరిష్కారించాలని వినతి**

**-మదనపల్లె ఏఎంసీ చైర్మన్ జంగాల శివరామ్ వినతి**



మదనపల్లి ఫిబ్రవరి 10 నేటిపత్రిక ప్రజాసీమ: మదనపల్లె టమోటా మార్కెట్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చంనాయుడును కోరడం జరిగిందని మదనపల్లె ఏఎంసీ చైర్మన్ జంగాల శివరామ్ మీడియాకు తెలియజేశారు. విజయవాడ లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మదనపల్లె అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరామ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చంనాయిడు దృష్టికి రైతుల సమస్యలు తీసుకుని వెళ్ళారు. టమోటా సీజన్ ప్రారంభానికి ముందే సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని విన్నవించారు. పడమటి మండలాలలో టమోటా పంట విస్తారంగా పండిస్తారని వివరించారు. మదనపల్లె టమోటా మార్కెట్ నుంచి దేశంలోని సుదూర ప్రాంతాలకు రవాణా చేయడం జరుగుతుందని వివరించారు. టమోటా రైతులు, మండి యజమానులు, వ్యాపారస్తులు, రవాణా వాహనాల యజమానులు, డ్రైవర్లు, కార్మికులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని వివరించడం జరిగింది. మదనపల్లె జిల్లా కేంద్రం అయిందనే విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకు వెళ్ళారు. ప్రస్తుతం టమోటా మార్కెట్లో నెలకొన్న సమస్యలు అనేకం ఉన్నాయని, సీజన్ ప్రారంభానికి ముందే పరిష్కారం చేయాలని కోరారు. సమస్యలు పరిష్కారిస్తే సీజన్ లో ఎలాంటి సమస్యలు తలెత్తవని, మార్కెట్ పై దృష్టి సారించాలని విన్నవించారు. మంత్రి అచ్చంనాయుడు సావధానంగా విన్నారని, సమస్యల పరిష్కారానికి సానుకులంగా స్పందించారని తెలియజేశారు.

# “లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధుల పై రివ్యూ మీటింగ్”



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా డాక్టర్ సి.యామిని, చైర్మన్-కం-జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, కడప వారి సూచనల మేరకు ఎస్.బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారు కడప కోర్టు కాంపౌండ్ లో గల న్యాయ సేవా సదన్ నందు “లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులు పై రివ్యూ మీటింగ్” నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ “లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులు, చట్టపరమైన సలహాలు, జైలు విజిట్లు, కేసుల వివరాలు మరియు పరిష్కారము మొదలగు అంశాలను వివరించారు, ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎన్.హరిబాబు, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్లు ఎమ్ చంద్రకాంతమ్మ, ఎమ్ శాంత, ఎం.వినయ్ కుమార్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్లు పి.మనోహర్, ఎం సౌజన్య, ఎన్. నీలకంతేశ్వర రెడ్డి, షేక్ అక్బర్ అలీ, ఎస్.రవితేజ, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాలు, శివరాత్రికి పటిష్ట బందోబస్తు: జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి, ఫిబ్రవరి 10(నేటిపత్రిక ప్రజాసీమ): మహాశివరాత్రి సందర్భంగా శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాలతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న శివాలయాల్లో భక్తుల భద్రత కోసం పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన, శ్రీకాళహస్తి దేవస్థానం పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, అదనపు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిరంతర నిఘా చేపట్టాలని సూచించారు. ఆలయాల్లో బారికేడ్లు, క్యూలైన్ వ్యవస్థ, సీసీ కెమెరాలు, డ్రోన్ సర్వైలెన్స్ ద్వారా పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. భక్తులకు తాగునీరు, వైద్య సహాయం వంటి మౌలిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. భక్తులకు సురక్షితమైన, ప్రశాంతమైన దర్శన వాతావరణం కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవి మనోహర ఆచారి (శాంతిభద్రతలు), శ్రీనివాసులు, డీఎస్పీలు మూర్తి (శ్రీకాళహస్తి), శ్రీనివాస్, సిటీ సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



# ప్రపంచ పప్పుధాన్యాల దినం

**- ఆరోగ్యానికి శక్తి... ఆహార భద్రతకు భరోసా**

**- రైతు ఆదాయానికి ఆధారం... భవిష్యత్ వ్యవసాయానికి దిశ**

డెస్క్, ఫిబ్రవరి 10 (నేటిపత్రిక ప్రజాసీమ ప్రతినిధి): ప్రపంచవ్యాప్తంగా పోషకాహార లోపం, ఆహార భద్రత వంటి అంశాలు పెద్ద సవాలుగా మారుతున్న వేళ పప్పుధాన్యాల ప్రాధాన్యం మరింత స్పష్టంగా కనిపిస్తోంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు అందించే ఆహారంగా పప్పుధాన్యాలు కోట్లాది ప్రజల జీవితాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ విలువను గుర్తు చేస్తూ ప్రపంచ పప్పుధాన్యాల దినాన్ని పాటిస్తున్నారు. ఇది కేవలం ఒక ఆహార పదార్థాన్ని గుర్తు చేసే రోజు కాదు. ఆరోగ్యం, వ్యవసాయం, ఆర్థిక వ్యవస్థ అన్నింటినీ కలిపే అంశంపై దృష్టి సారించే రోజు. పప్పుధాన్యాలు ప్రోటీన్లకు ప్రధాన వనరు. ముఖ్యంగా శాకాహారాన్ని అనుసరించే ప్రజలకు ఇవి శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. పిల్లల ఎదుగుదల, గర్భిణీ మహిళల ఆరోగ్యం, వృద్ధుల శక్తి పరిరక్షణలో పప్పుధాన్యాలు కీలకంగా నిలుస్తాయి. ఫైబర్, ఖనిజ లవణాలు, విటమిన్లు సమృద్ధిగా ఉండటంతో జీర్ణక్రియ మెరుగుపడుతుంది. రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలను తగ్గించడంలో పప్పుధాన్యాలు ప్రభావవంతంగా పనిచేస్తాయి. ఆహార భద్రత దృష్ట్యా పప్పుధాన్యాల పాత్ర మరింత కీలకం. తక్కువ నీటితో పండే పంటలుగా ఇవి గుర్తింపు పొందాయి. వాతావరణ మార్పుల ప్రభావం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో నీటి వినియోగం తక్కువగా ఉండే పప్పుధాన్యాలు భవిష్యత్ వ్యవసాయానికి ఆశాజ్యోతి లాంటివి. ఇవి భూమి సారాన్ని పెంచే లక్షణం కలిగి ఉండటంతో, దీర్ఘకాలిక వ్యవసాయానికి అనుకూలంగా మారుతున్నాయి. రైతుల కోణంలో చూస్తే పప్పుధాన్యాలు స్థిరమైన ఆదాయానికి దారి చూపే పంటలుగా నిలుస్తున్నాయి. పెట్టుబడి తక్కువగా ఉండటం, సాగు ఖర్చులు పరిమితంగా ఉండటం వల్ల చిన్న, సన్నకారు రైతులకు ఇవి అనుకూలంగా ఉంటాయి. సరైన మద్దతు ధరలు, మార్కెట్ సదుపాయాలు లభిస్తే రైతుల ఆదాయం పెరిగే అవకాశం ఉంది. పప్పుధాన్యాల సాగు విస్తరిస్తే వ్యవసాయ రంగంలో ప్రమాదాలు కూడా కొంత మేర తగ్గుతాయి. అయితే పప్పుధాన్యాల ఉత్పత్తి, వినియోగంలో ఇంకా ఎన్నో సవాళ్లు ఉన్నాయి. దిగుబడులు తక్కువగా ఉండటం, నాణ్యమైన విత్తనాల లభ్యత లోపించడం, నిల్వలు--రవాణా సమస్యలు రైతులను ఇబ్బంది పెడుతున్నాయి. మరోవైపు ప్రజల ఆహార అలవాట్లలో కూడా మార్పు అవసరం ఉంది. ఆరోగ్యకరమైన ఆహారంగా పప్పుధాన్యాల వినియోగం పెరగాల్సిన అవసరంపై అవగాహన ఇంకా పూర్తిగా చేరలేదు. ప్రభుత్వాలు, సంస్థలు ఈ దిశగా మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. పప్పుధాన్యాల సాగును ప్రోత్సహించే విధానాలు, పరిశోధన, మార్కెట్ మద్దతు అవసరం. పాఠశాల భోజన పథకాలు, పోషకాహార కార్యక్రమాల్లో పప్పుధాన్యాలకు ప్రాధాన్యం ఇస్తే, పిల్లల్లో ఆరోగ్య అవగాహన కూడా పెరుగుతుంది. అదే సమయంలో రైతులకు స్థిరమైన మార్కెట్ కూడా లభిస్తుంది.

# ప్రొద్దుటూరు నియోజకవర్గాన్ని రాయలసీమ ఎకానమీ పవర్ హబ్ అభివృద్ధి చేస్తాం..!

**-ప్రొద్దుటూరు నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**

**-స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, జేసీ నిధి మీనాజ్ ఏఎస్పీ విభూకృష్ణ హాజరు**

**-ప్రొద్దుటూరు డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం**

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 10 నేటిపత్రిక ప్రజాసీమ: వాణిజ్య పరంగా అత్యంత ప్రసిద్ధిగాంచిన ప్రొద్దుటూరు నియోజకవర్గాన్ని రాయలసీమలో ఒక ప్రత్యేక ఎకానమీ పవర్ హబ్ అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామని.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. మంగళవారం సాయంత్రం ప్రొద్దుటూరు మున్సిపల్ సమావేశ మందిరంలో.. ఏర్పాటు చేసిన ప్రొద్దుటూరు నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... వాణిజ్యపరంగా పేరున్న ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో ఎప్పటినుండో అపరిష్కృతంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను పూర్తి స్థాయిలో పునరుద్ధరించి, అధునాతన, సాంకేతిక పద్దతితో భూగర్భ డ్రెయినేజీని చేపడుతామన్నారు. అందుకోసం పట్టణములోని అన్ని ప్రధాన డ్రైనేజీ కాలువలు ఆనుకుని ఉన్న నివాసాలు, ఆక్రమ కట్టడాలను తొలగించి, కాలువలను విస్తరించేందుకు ప్రణాళికలు చేపట్టాలన్నారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధి నుండి గ్రామీణ ప్రాంతాల వరకు విస్తరించి ఉన్న మడూరు కాలువ సమస్యను కూడా శాస్వితంగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ప్రత్యేకమైన పారిశుద్ధ్య చర్యలను చేపట్టాలని జిల్లా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. అవసరమైతే అదనంగా పారిశుద్ధ్య కార్మికులను కూడా నియమించుకొనే చర్యలను చేపట్టాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి.. ఇప్పటివరకు అపరిష్కృతంగా ఉందన్న పారిశుధ్య సమస్యకు సంపూర్తిగా పరిష్కారం చూపాలన్నారు. స్వచ్ఛఆంధ్రప్రదేశ్ లక్ష్యం సాధనలో భాగంగా ప్రొద్దుటూరు మున్సిపాలిటీ వంద శాతం స్వచ్ఛతను సాధించేందుకు ప్రతి అధికారి కృషి చేయాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా జిల్లాలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులను ఈ ఆర్థిక సంవత్సరంలోగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే పనులు మొదలు పెట్టి పురోగతిలో ఉన్న వాటిని మార్చి 15 లోపు పూర్తి చేయాలన్నారు. ఇంకా మొదలు పెట్టాల్సిన పనులను కూడా.. నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయగలిగితేనే మొదలు పెట్టాలన్నారు. త్వరితగతిన చేయగలిగిన గోకులం షెడ్స్, సిసి రోడ్లు, బిటి రోడ్లు, డబ్ల్యూ ఎం రోడ్లు, కాంపౌండ్ వాల్ మొదలైన పనులను ఎంపిక చేసుకుని 100% పూర్తి చేసేలా మొదలు పెట్టాలన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో పుష్కలమైన సాగునీటి సదుపాయాలు ఉండడంతో వ్యవసాయ పంటల సాగు విస్తీర్ణం అధికంగానే సాగుతొందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, ఉద్యాన పంటలతో పాటు పశుసంపదను, పాడి పరిశ్రమను అభివృద్ధి చేయాలన్నారు. అందుకోసం డిఆర్డీఏ, మెప్మా, వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖలు సమన్వయంతో ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఏపీసీఎన్ఎఫ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రసాయనాలు లేని, ఆరోగ్యకరమైన ప్రకృతి వ్యవసాయాన్ని ప్రత్యేకంగా ప్రేరేపిస్తోందన్నారు. ఆ దిశగా జిల్లాలో 38 వేల ఎకరాలలో సహజ పద్దతిలో వ్యవసాయం ద్వారా 48 వేల మంది రైతులు ముఖ్యంగా మహిళలు.. ఆరోగ్యకరమైన పంటలను పండిస్తున్నారన్నారు. సుస్థిర మార్కెటింగ్ అభివృద్ధికో ఫ్రీ ట్రస్ట్ మార్కెటింగ్ విధానం ద్వారా.. స్వేచ్ఛా పారదర్శక విక్రయాలు చేపట్టడం జరుగుతుంది. అత్యధిక మార్కెటింగ్ నిర్వహణ సౌలభ్యం ఉన్న ప్రొద్దుటూరులో ఫ్రీ ట్రస్ట్ మార్కెట్ ను త్వరలో నిర్వహణలోకి తీసుకురావడం జరుగుతోందన్నారు. జిల్లాలో ఉద్యాన పంటలను విస్తారంగా పండించి రైతులకు సుస్థిర ఆదాయ వనరులనుంసమకూర్చే లక్ష్యంతో.. ఉద్యాన శాఖ, డ్వామా, మైక్రోఇరిగేషన్ శాఖలు సంయుక్తంగా కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే జిల్లాలో సంప్రదాయ వ్యవసాయ పంటలు కాకుండా భవిష్యత్తులో దీర్ఘకాలిక ఆదాయాన్ని ఇచ్చే ఉద్యాన పంటలను పండించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఉద్యాన పంటలు సాగు కోసం రాష్ట్ర ప్రభుత్వం 90 శాతంాామేర సబ్సిడీ పథకాలను అమలులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చే ఇలాంటి అవకాశాలతో రైతులు అపదాయకంగా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. ప్రొద్దుటూరు పట్టణంలో ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ద్వారా చుట్టు పక్కల ప్రాంతాల గ్రామాలకు వైద్యసేవలు అందుతున్నాయి. వైద్య విధాన పరిషత్ పరిధిలో అధునాతన భవన నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయని.. ప్రతిరోజు వందలాది మంది ఓపిలు నమోదు కావడంతో పాటు, దీర్ఘ కాలిక వ్యాధులకు చికిత్సలు, ఐపి బ్లాకులు ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రత్యేకించి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లతో పాటు, సుఖ ప్రసవాలను చేయడం జరుగుతోందన్నారు. ప్రస్తుతం వైద్య ఆరోగ్యశాఖ ద్వారా జిల్లాలోని అన్ని ఆరోగ్యకేంద్రాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించడం జరుగుతోందని, స్క్రబ్ టైఫాస్ పట్ల అవగాహన పెంచడంతో పాటు ముందస్తు జాగ్రత్తలు కూడా ఇవ్వడం జరుగుతోందన్నారు. ప్రొద్దుటూరు పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో రోడ్ల విస్తరణకు ప్రణాళికల రూపొందించాలన్నారు. ముందుగా ఎనిక్రోచ్మెంట్ కు సంబంధించిన అన్ని కార్యక్రమాలను ఒక్క నెలలోపు పూర్తి చేయలన్నారు. ఎన్ క్రోచ్మెంట్ నిర్వాసితులకు ప్రత్యామ్నాయ నివాస సదుపాయాలను హౌసింగ్ పథకం ద్వారా, లేదా ఖాళీగా ఉన్న ప్రభుత్వ హౌసింగ్ సముదాయాల్లో కల్పించే ఈ అవసరమైతే.. భూసేకరణ చేపట్టి వారికి పునరావాసం కల్పించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా ప్రొద్దుటూరులో అభివృద్ధి తోపాటు ఆదాయాన్ని కూడా పెంచే మార్గాలను పెంచాలన్నారు. పట్టణ పరిధిలోని అన్ని నివాస ప్రాంతాల్లో టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి ప్రతి కట్టడానికి బిల్డింగ్ పర్మిషన్ తీసుకునేలా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ఈ ప్రక్రియను ప్రజలకు మరింత సులభతరం చేస్తూ... ప్రజలను మధ్యవర్తుల వద్దకు వెళ్లకుండా మున్సిపల్ అధికారులే ప్రత్యేక మేళా ద్వారా.. ప్రతి ఒక్కరూ టౌన్ ప్లానింగ్ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణములోని అన్ని ప్రధాన కూడళ్లు, రహదారుల్లో సిసి కెమెరాల నిఘాను పటిష్టం చేయాలన్నారు. దక్షిణ భారత దేశంలోనే బులియన్ మార్కెట్ కు ప్రాముఖ్యత ఉన్న ప్రొద్దుటూరు పట్టణం రాష్ట్రానికి ప్రధాన మార్కెటింగ్ ఆదాయ వనరుగా కొనసాగుతోందన్నారు. అంతటి వాణిజ్య ప్రాముఖ్యం ఉన్న ప్రొద్దుటూరులో లా అండ్ ఆర్డర్ సక్రమంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని పోలీసు, రెవెన్యూ అధికారులకు సూచించారు. ప్రధానంగా ప్రొద్దుటూరు పట్టణంలో గ్యాంబ్లింగ్, బెట్టింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాలను, గంజాయి అమ్మకాలను సమూలంగా తుడిచి పెట్టేందుకు పోలీస్, రెవెన్యూ యంత్రాంగం పారదర్శకంగా, నిక్కచ్చిగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రయివేటు, ప్రభుత్వ ప్రాపర్టీకి సంబంధించిన పెండింగ్ లోఉన్న పన్నుల వసూళ్లపై ఆదేశాలు ఇవ్వడం జరిగింది. బులియన్ మార్కెట్ లో పెరిన్నికగన్న ప్రొద్దుటూరు పట్టణంలో బంగారు నగల తయారీ పరిశ్రమ క్లస్టర్ ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం అవుతాయన్నారు. ప్రొద్దుటూరులో హౌసింగ్ పథకం క్రింద గతంలో పేదలకు మంజూరైన ప్రభుత్వ ఇళ్ల నిర్మాణంలో అవకతవకలు జరిగాయంటూ వస్తున్న అభియోగాలు, విమర్శల పట్ల జిల్లా కలెక్టర్ స్పందిస్తూ.. పూర్తిస్థాయిలో విచారణ చేపడుతామన్నారు. హౌసింగ్, ప్రయివేటు ఏజెన్సీల ఆధ్వర్యంలో వచ్చిన పలు అభ్యంతరాలపై విచారణ చేపట్టడం జరుగుతోందన్నారు. ఐడిఎంఎస్ పద్ధతి ద్వారా చేపట్టిన పట్టణ ప్రణాళికను రూపొందించడం జరుగుతుందన్నారు. ఆర్ అండ్ బి శాఖ ద్వారా నియోజకవర్గంలో జరుగుతున్న రోడ్లు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలు ఎక్కడ పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

# మహాశివరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి స్థాయి లో చేయండి

**-భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగరాదు..**

**-టెలి కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదేశాలు.**

వై ఎస్ ఆర్ కడప, నేటిపత్రిక ప్రజాసీమ: మహా శివరాత్రి ని పురస్కరించుకొని శైవ క్షేత్రాలలో శైవ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళ వారం రాత్రి జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా ..ఈ నెల 15న మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 14వ తేదీ నుండి 16వ తేదీ వరకు.. జిల్లాలోని 16 ప్రముఖ శైవక్షేత్రాల్లో మహా శివరాత్రి ఉత్సవ నిర్వహణ ఏర్పాట్లపై.. దేవాదాయ శాఖ, రెవెన్యూ,పోలీసు అధికారులతో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... మహా శివరాత్రి సందర్భంగా జిల్లా లోని ప్రధానమైన శైవ క్షేత్రాలలో భక్తుల రద్దీ ని దృష్టి లో ఉంచుకుని అన్ని ఏర్పాట్లు పూర్తిస్థాయిలో ముందస్తుగా చేయాలన్నారు.భక్తులకు అసౌకర్యం కలగకుండా దర్శన ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు... జిల్లాలో ప్రధానంగా పెండ్లిమర్రి మండలంలోని పొలతల శ్రీ మల్లీశ్వర స్వామి దేవస్థానం, సిద్దవటం మండలం వొంతాటిపల్లిలోని శ్రీ నిత్యపూజ స్వామి దేవస్థానం, బ్రహ్మంగారిమఠం మండలంలోని కందిమల్లయ్య పల్లిలోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం, శ్రీ ఈశ్వరి దేవి మఠం, ప్రొద్దుటూరు మండలంలోని శ్రీ అగస్తేశ్వర స్వామి దేవాలయం,గోపవరం మండలంలోని ఓబులం గ్రామపరిధిలో శ్రీ మల్లెం కొండేశ్వరస్వామి దేవాలయం, చాపాడు మండలం అల్లాడు పల్లిలోని శ్రీ వీరభద్ర స్వామి దేవాలయం, బద్వేలు మండలం లంకమల్ల గ్రామంలోని శ్రీ లంకమల్లేశ్వర స్వామి దేవాలయంల్లోని శ్రీ గుండాల ఈశ్వర స్వామి దేవాలయం,మైలవరం మండలంలోని అగస్తికోన లోని శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవాలయం, జమ్మలమడుగు మండలంలోని కన్యతీర్థం నందు గల శ్రీ ఈశ్వర స్వామి దేవాలయం, వేముల మండలం నల్లచెరువుపల్లె లోని భైరవేశ్వరస్వామి ఆలయం,పులివెందుల మండలం మిట్టమల్లేశ్వర స్వామి దేవాలయం,వల్లూరు మండలం పుష్పగిరి లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయం,వివిఎన్ పల్లె మండలంలోని అనిమేల సంఘమేశ్వర స్వామి దేవస్థానం,ఖాజీపేట మండలంలోని పుల్లూరు గ్రామంలోని శ్రీ నాథగేశ్వర స్వామి దేవాలయం, రాజంపేట మండలంలోని హత్యరాల కామాక్షి ప్రితేశ్వర స్వామి దేవాలయం.. మొదలయిన 16 శైవక్షేత్రాల్లో లక్షలాది సంఖ్యలో భక్తులు హాజరవుతారని, వారందరికీ పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. శైవ క్షేత్రాలలో భక్తుల రద్దీ ఎక్కువ గా ఉంటున్నందున ప్రధానంగా పారిశుద్ధ్య నిర్వహణ పై దృష్టి పెట్టాలన్నారు.ముఖ్యంగా ఆయా ప్రాంతాల్లో శానిటేషన్ పనులు సంబంధిత అధికారులతో సమన్వయమై పరిశుభ్రంగాఉంచుకోవాలన్నారు. త్రాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. భక్తుల రద్దీ బట్టిఆప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యాలను అధికంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. వైద్య సేవలకు సంబంధించి వైద్య శిబిరాలు,108 అంబులెన్స్ కు అందుబాటు లో వైద్యాధికారులు,వైద్య సిబ్బంది ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయా శైవక్షేత్రాలకు అధిక సంఖ్యలో భక్తులు రానున్న సందర్భంగా ప్రతి చోటా మహిళలకు ఇబ్బంది లేకుండా తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, తాత్కాలిక మరుగుదొడ్ల ను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. అన్ని శైవక్షేత్రాల్లో కంట్రోల్ రూములను ఏర్పాటు చేయాలని,అలాగే జిల్లా స్థాయిలో కూడా కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేయాలని డి ఆర్ ఓ ను ఆదేశించారు. అన్ని శైవక్షేత్రాలలో దేవాదాయ శాఖ అధికారులు పోలీసు వారితో సమన్వయం చేసుకొని పటిష్ఠమైన బందోబస్తు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలనన్నారు, పటిష్ట మైన బ్యారికేడింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. బందో బస్సులో భాగంగా ఎన్ సి సి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో పాటు మహిళా సేవకులను కూడా ఈ సేవలో వినియోగించాలన్నారు.

# మృదువైన బొమ్మలో దాగున్న ప్రేమ... ఆప్యాయతకు ప్రతీకగా మారిన రోజు

డెస్క్, ఫిబ్రవరి 10 (నేటిపత్రిక ప్రజాసీమ ప్రతినిధి): ప్రేమను వ్యక్తపరచడానికి మాటలు అవసరం లేని సందర్భాలు కొన్ని ఉంటాయి. ఒక చూపు, ఒక చిరునవ్వు, ఒక చిన్న బహుమతి కూడా మనసులోని భావాన్ని స్పష్టంగా చెప్పగలదు. అలాంటి భావప్రకటనకు ప్రతీకగా నిలిచిన రోజే టెడ్డి బేర్ డే. ప్రేమ వారంలో ముఖ్యమైన రోజుగా గుర్తింపు పొందిన ఈ రోజు, ప్రేమ, ఆప్యాయత, సంరక్షణ వంటి భావాలను మృదువుగా వ్యక్తపరచే సందర్భంగా మారింది. టెడ్డి బేర్ అనే చిన్న బొమ్మ మనసులకు ఎంత దగ్గరగా ఉంటుందో ఈ రోజున మరోసారి గుర్తుకు వస్తుంది. టెడ్డి బేర్ డే మొదటిగా ప్రేమికుల మధ్య ప్రాచుర్యంలోకి వచ్చినప్పటికీ, కాలక్రమేణా దాని పరిధి విస్తరించింది. నేడు ఇది కేవలం ప్రేమికులకే పరిమితం కాకుండా, పిల్లలు, స్నేహితులు, కుటుంబ సభ్యుల మధ్య కూడా ఆనందాన్ని పంచుకునే రోజుగా మారింది. ఒక టెడ్డి బేర్ ఇచ్చే ఆప్యాయత భావం, మాటలకన్నా లోతుగా మనసును తాకుతుంది. అందుకే ఈ రోజు అన్ని వయసులవారిలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. టెడ్డి బేర్‌కు ఉన్న ప్రత్యేకత దాని మృదుత్వంలోనే కాదు, అది కలిగించే భద్రత భావంలోనూ ఉంది. పిల్లలకు ఇది ఒక స్నేహితుడిలా మారుతుంది. ఒంటరిగా ఉన్నప్పుడు తోడుగా ఉంటుంది. భయపడినప్పుడు ధైర్యం ఇస్తుంది. అదే విధంగా పెద్దల జీవితంలో కూడా టెడ్డి బేర్ ఒక భావోద్వేగ గుర్తుగా నిలుస్తుంది. బాల్య జ్ఞాపకాలను గుర్తు చేస్తుంది. నిర్భారం అయిన రోజుల్ని మళ్లీ మనసులో జీవింపజేస్తుంది. యువతలో టెడ్డి బేర్ డేకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ప్రేమను సున్నితంగా వ్యక్తపరచే ఈ బొమ్మ, సంబంధాల్లోని మృదుత్వాన్ని గుర్తు చేస్తుంది. ప్రేమ అంటే కేవలం ఆర్భాటం కాదు, సంరక్షణ, అర్థం చేసుకోవడం కూడా అని ఈ రోజు చెబుతుంది. ఖరీదైన బహుమతుల కంటే భావానికి విలువనిచ్చే రోజుగా టెడ్డి బేర్ డే నిలుస్తోంది. కుటుంబాల్లో కూడా ఈ రోజు ఆనందాన్ని తీసుకొస్తోంది. తల్లిదండ్రులు పిల్లలకు టెడ్డి బేర్ బహుమతిగా ఇచ్చి తమ ప్రేమను చూపిస్తారు. పిల్లలు పెద్దలపై ఉన్న ఆప్యాయతను చిన్న బొమ్మ ద్వారా వ్యక్తపరుస్తారు. బిజీ జీవితాల్లో భావాలను వ్యక్తపరచడానికి సమయం లేకపోయినా, ఈ రోజు మాత్రం కుటుంబ సభ్యులను దగ్గర చేసే అవకాశాన్ని ఇస్తుంది. టెడ్డి బేర్ డే మరో ముఖ్యమైన సందేశాన్ని కూడా ఇస్తుంది. ప్రేమను గట్టిగా కాదు, మృదువుగా చూపించాలన్న భావనను బలపరుస్తుంది. మనసుకు సాంత్వన ఇచ్చే చిన్న విషయాల విలువను గుర్తు చేస్తుంది. ఆనందం పెద్ద ఖర్చుల్లోనే కాదు, చిన్న బొమ్మలో కూడా దొరుకుతుందని చెబుతుంది. ఈ సందేశమే టెడ్డి బేర్ డేను ప్రత్యేకంగా నిలబెడుతోంది. మొత్తంగా టెడ్డి బేర్ డే అనేది ఒక రోజు సంబరానికి మాత్రమే పరిమితం కాదు. ఇది అనుబంధాలను మృదువుగా తాకే రోజు. ప్రేమను మాటలకంటే భావాలతో చెప్పే రోజు. పిల్లల చిరునవ్వుల్లో, యువత ఆనందంలో, కుటుంబ ఆప్యాయతలో ప్రతిఫలించే రోజు. మృదువైన బొమ్మలో దాగున్న పెద్ద భావాన్ని గుర్తు చేసే రోజే టెడ్డి బేర్ డే.

# ప్రపంచ పల్సెస్ అవగాహన దినోత్సవం

**– తక్కువ ఖర్చుతో ఆరోగ్యం... పోషకాహార లోపానికి పరిష్కారం**

డెస్క్, ఫిబ్రవరి 10 (నేటిపత్రిక ప్రజాసీమ ప్రతినిధి): ప్రపంచవ్యాప్తంగా పోషకాహార లోపం ఒక పెద్ద సవాలుగా మారిన నేపథ్యంలో, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు అందించే ఆహారాలపై దృష్టి పెరుగుతోంది. అలాంటి ఆహారాల్లో పల్సెస్ కీలకమైన స్థానం దక్కించుకున్నాయి. ప్రజలకు ఈ వాస్తవాన్ని తెలియజేసేందుకు, పల్సెస్ ప్రాధాన్యాన్ని గుర్తుచేసేందుకు ప్రపంచ పల్సెస్ అవగాహన దినోత్సవాన్ని పాటిస్తున్నారు. ఇది ఆరోగ్యం, ఆహారం, వ్యవసాయం అన్న మూడు రంగాలను కలిపే ముఖ్యమైన సందర్భం. పల్సెస్ ప్రోటీన్లకు ప్రధాన వనరులు. ముఖ్యంగా శాకాహారాన్ని అనుసరించే కోట్లాది మందికి ఇవే శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తున్నాయి. పిల్లల ఎదుగుదల, యువత శక్తి, వృద్ధుల ఆరోగ్య సంరక్షణలో పల్సెస్ కీలక పాత్ర పోషిస్తాయి. ఫైబర్, ఖనిజ లవణాలు, విటమిన్లు సమృద్ధిగా ఉండటంతో జీర్ణక్రియ మెరుగుపడుతుంది. రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలను తగ్గించడంలో పల్సెస్ ప్రభావవంతంగా పనిచేస్తాయి. తక్కువ ఖర్చుతో ఆరోగ్యాన్ని అందించే ఆహారంగా పల్సెస్ ప్రత్యేక గుర్తింపు పొందాయి. ఖరీదైన ఆహారాలు అందుబాటులో లేని పేద, మధ్యతరగతి కుటుంబాలకు పల్సెస్ ప్రధాన ఆధారంగా నిలుస్తున్నాయి. రోజువారీ ఆహారంలో పల్సెస్‌ను చేర్చడం ద్వారా సమతుల్య పోషకాహారం సాధ్యమవుతుంది. అందుకే పోషకాహార లోపం నివారణలో పల్సెస్‌ను ముఖ్య ఆయుధంగా భావిస్తున్నారు. ఆహార భద్రత కోణంలో పల్సెస్ ప్రాధాన్యం మరింత ఎక్కువ. తక్కువ నీటితో పండే పంటలుగా ఇవి గుర్తింపు పొందాయి. వాతావరణ మార్పుల ప్రభావం పెరుగుతున్న ఈ కాలంలో, నీటి వినియోగం తక్కువగా ఉండే పల్సెస్ భవిష్యత్తు వ్యవసాయానికి ఆశాజ్యోతి లాంటివి. భూమి సారాన్ని కాపాడే లక్షణం ఉండటంతో, దీర్ఘకాలిక వ్యవసాయానికి ఇవి అనుకూలంగా మారుతున్నాయి. పల్సెస్ సాగు రైతులకు కూడా లాభదాయకంగా మారే అవకాశముంది. పెట్టుబడి తక్కువగా ఉండటం, సాగు ఖర్చులు పరిమితంగా ఉండటం వల్ల చిన్న, సన్నకారు రైతులకు ఇవి అనుకూల పంటలుగా నిలుస్తున్నాయి. సరైన మద్దతు ధరలు, మార్కెట్ సదుపాయాలు లభిస్తే రైతుల ఆదాయం పెరుగుతుంది. అదే సమయంలో దేశానికి అవసరమైన పోషకాహారం కూడా అందుబాటులో ఉంటుంది. అయితే పల్సెస్ వినియోగం, ఉత్పత్తిలో ఇంకా సవాళ్లు ఉన్నాయి. ప్రజల ఆహార అలవాట్లలో మార్పు అవసరం ఉంది. ఆరోగ్యకరమైన ఆహారంగా పల్సెస్ వినియోగం పెరగాల్సిన అవసరంపై మరింత అవగాహన కల్పించాలి. పాఠశాల భోజనాలు, పోషకాహార కార్యక్రమాల్లో పల్సెస్‌కు ప్రాధాన్యం ఇస్తే, చిన్న వయసులోనే ఆరోగ్య అలవాట్లు పెరుగుతాయి. ప్రపంచ పల్సెస్ అవగాహన దినోత్సవం ఈ అంశాలన్నింటిపై ఒకేసారి దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తుంది. ఇది కేవలం ఒక రోజు అవగాహన కార్యక్రమంగా మిగలకుండా, నిరంతర ప్రయత్నంగా మారాలి. ఆరోగ్యకరమైన సమాజం కోసం సరైన ఆహారం అవసరం. ఆ ఆహారంలో పల్సెస్‌కు ప్రత్యేక స్థానం ఇవ్వాల్సిన అవసరం ఉంది. మొత్తంగా పల్సెస్ పోషకాహార లోపాన్ని తగ్గించే శక్తివంతమైన సాధనం. తక్కువ ఖర్చుతో ఆరోగ్యాన్ని అందించే ఆహారం. రైతులకు ఆదాయాన్ని, ప్రజలకు ఆరోగ్యాన్ని అందించే విలువైన పంటలు. ప్రపంచ పల్సెస్ అవగాహన దినోత్సవం మనకు ఇచ్చే సందేశం స్పష్టం -- పల్సెస్‌ను మన రోజువారీ ఆహారంలో మరింత ప్రాధాన్యంగా చేర్చుకోవాల్సిన సమయం ఇది.

# ఆదినారాయణ రెడ్డి వ్యాఖ్యలతో పార్టీకి సంబంధం లేదు: ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్

**- ఏపీ బీజేపీలో ప్రకంపనలు**

**- కూటమిపై 'కమ్మ' వ్యాఖ్యలతో దుమారం**

**- ఆదినారాయణ రెడ్డిని వివరణ అడుగుతాం**



అమరావతి, ఫిబ్రవరి 10 (నేటిపత్రిక ప్రజాసీమ ప్రతినిధి): ఏపీ బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపాయి. కూటమి ప్రభుత్వం ఇంకా 'కమ్మగా' ఉందని, రాష్ట్రంలో బీజేపీ లేకపోతే టీడీపీ, జనసేన కూడా లేవని, కూటమిలో బీజేపీనే ప్రధానం అన్న వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి దారితీశాయి. ఈ వ్యాఖ్యలపై ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ స్పష్టమైన వివరణ ఇచ్చారు. ఆదినారాయణ రెడ్డి వ్యాఖ్యలతో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదని మాధవ్ తేల్చిచెప్పారు. బీజేపీ సమావేశంలో ఆదినారాయణ రెడ్డి మాట్లాడినప్పటికీ, ఆయన వ్యక్తిగత అభిప్రాయాలతో పార్టీ ఏకీభవించడం లేదని స్పష్టం చేశారు. కూటమి పార్టీల మధ్య ఐక్యత, సమన్వయంతోనే ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ఇటువంటి వ్యాఖ్యలు పార్టీ అధికారిక వైఖరి కాదన్నారు. ఈ అంశంపై ఆదినారాయణ రెడ్డి నుంచి స్పష్టమైన వివరణ తీసుకుంటామని మాధవ్ వెల్లడించారు. కూటమిలో భాగస్వామ్య పక్షాలన్నీ పరస్పర గౌరవంతో పనిచేస్తున్నాయని, ప్రజా ప్రయోజనాలే కూటమి లక్ష్యమని తెలిపారు. వ్యక్తిగత వ్యాఖ్యల వల్ల కూటమి ఐక్యత దెబ్బతినదని, బీజేపీ తన రాజకీయ క్రమశిక్షణను కచ్చితంగా పాటిస్తుందని మాధవ్ స్పష్టం చేశారు.

# విజ్జేశ్వరంలో రికార్డు స్థాయి అభివృద్ధి పనులు: మంత్రి కందుల దుర్గేష్

**– విస్తృత పర్యటనలో పల్లె పండుగ పనుల పరిశీలన**

**– రూ.60 లక్షలకు పైగా వ్యయంతో అభివృద్ధి కార్యక్రమాలు**

**– నిడదవోలు నియోజకవర్గం అభివృద్ధి దిశగా ముందడుగు**



విజ్జేశ్వరం, ఫిబ్రవరి 10 (నేటిపత్రిక ప్రజాసీమ ప్రతినిధి): నిడదవోలు నియోజకవర్గంలోని విజ్జేశ్వరం గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమం కింద చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రి కందుల దుర్గేష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, డ్రెయిన్లు సహా పలు మౌలిక సదుపాయాల పనుల పురోగతిని పరిశీలిస్తూ, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న డొంక రోడ్లను పూర్తి చేయగలిగినందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమర్థ నాయకత్వం, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో విజ్జేశ్వరంలో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని మంత్రి తెలిపారు. గత 18 నెలల కాలంలోనే గ్రామంలో రూ.60 లక్షలకు పైగా వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసినట్లు వెల్లడించారు. పల్లె పండుగ 1.0 కింద సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం పూర్తయ్యిందని, ప్రస్తుతం ఎస్సీ--బీసీ కాలనీల్లో మరిన్ని రోడ్ల పనులు కొనసాగుతున్నాయని వివరించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇచ్చిన మాటకు కట్టుబడి నిడదవోలు నియోజకవర్గానికి శాస్కి స్కీమ్, ఆర్ అండ్ బీ నిధుల ద్వారా భారీ మొత్తంలో రోడ్డు అభివృద్ధి పనులకు అనుమతులు తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. గత ఐదేళ్ల నిర్లక్ష్యాన్ని వెనక్కి నెట్టి, కూటమి ప్రభుత్వంలో నిడదవోలు నియోజకవర్గం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు వెళ్తోందని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.

# రైల్వే అభివృద్ధి అంశాలపై కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతులు

**– కొత్త రైల్వే లైన్ మంజూరుపై విజ్ఞప్తి**

**– డెమూ రైలు సర్వీస్ ప్రారంభించాలని డిమాండ్**

**– రైతులు, విద్యార్థులు, వ్యాపారులకు ప్రయోజనం**



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (నేటిపత్రిక ప్రజాసీమ ప్రతినిధి): పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని రైతులు, ఎగుమతిదారులు, వ్యాపారులు, విద్యార్థులు, సాధారణ ప్రయాణికుల ప్రయోజనార్థం రైల్వే వ్యవస్థలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి అంశాలపై ఈరోజు ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ను కలిసి వినతులు సమర్పించారు. ఈ భేటీలో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా పిడుగురాళ్ల నుంచి ప్రకాశం జిల్లా దర్శి, అద్దంకి, ఒంగోలు మీదుగా రామాయపట్నం పోర్ట్ వరకు కొత్త రైల్వే లైన్ మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. వ్యవసాయాధారిత ఈ ప్రాంతంలో ఎగుమతులకు అనుకూలమైన పంటలు, అనుబంధ ఉత్పత్తులు పెద్ద మొత్తంలో ఉత్పత్తి అవుతున్నాయని వివరించారు. ఈ రైల్వే లైన్ అమలులోకి వస్తే రామాయపట్నం పోర్ట్‌కు సరుకు రవాణా వేగవంతమవడంతో పాటు ప్రయాణికుల రాకపోకలకు సౌకర్యం కలుగుతుందని, చెన్నై--సికింద్రాబాద్ మధ్య రైల్వే దూరం తగ్గి ప్రాంతీయ అనుసంధానం మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. అలాగే నడికుడి--శ్రీకాళహస్తి కొత్త రైల్వే మార్గంలో సికింద్రాబాద్ నుంచి నడికుడి మీదుగా కనిగిరి వరకు ప్రయాణికుల సౌకర్యార్థం డెమూ రైలు సర్వీసును ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం సికింద్రాబాద్--కనిగిరి మధ్య నేరుగా రైలు సర్వీస్ లేకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. నడికుడి--శ్రీకాళహస్తి రైల్వే మార్గం ప్రారంభమైనప్పటికీ పూర్తి విద్యుదీకరణ ఇంకా జరగలేదని, ఈ నేపథ్యంలో డెమూ రైలు సర్వీస్ ప్రారంభించడం తక్షణ పరిష్కారమని తెలిపారు. భవిష్యత్తులో విద్యుదీకరణ పూర్తయ్యాక ఈ సర్వీసును మెము రైలు సర్వీస్‌గా అప్‌గ్రేడ్ చేయవచ్చని సూచిస్తూ, ఈ అంశాలపై తక్షణమే చొరవ చూపాలని కేంద్ర రైల్వే మంత్రిని కోరారు.